క్లుప్తంగా

మాతాశిశు మరణాలు నివారించాలి



సమీక్షా సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

మద్దికెర: ప్రసవం సమయంలో మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మండలంలోని ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ప్రతిపిల్లాడికి వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వడదెబ్బ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాష, సిబ్బంది సరస్వతమ్మ, కృష్ణమ్మ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చిప్పగిరిలో చలివేంద్రంను ప్రారంభిస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు

చిప్పగిరి: స్థానిక బస్టాండు సమీపంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సర్పంచ్ గోవిందరాజులు సొంత ఖర్చులతో మంగళవారం చలివేంద్రంను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో మంగళవారం చలివేంద్రంను సర్పంచ్ మూలింటి రాధమ్మ ప్రారంభించారు. గ్రామాల నుంచి వివిధ పనులపై ఆస్పరికి వచ్చిన వారి దాహార్తి తీర్చేందుకు గ్రామంలోని అంబేడ్కర్ సర్కిల్, పెద్దబావి వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఈఓ రామాంజినేయులు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాముడు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే గ్రామస్తుల దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్థలాల ఆక్రమణపై విచారణ

ఆలూరు రూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ గోదాము ఆవరణంలో స్థలాలు ఆక్రమించిన వారి వివరాలను మంగళవారం పోలీసులు సేకరించారు. జిల్లా మేనేజర్ రాజేష్ ఈ విషయమై సోమవారం ఆలూరు సీఐకు ఫిర్యాదు చేశారు. సొసైటీకి సంబంధించి మొత్తం 39 సెంట్ల స్థలం ఉందన్నారు. ఇందులో 6 సెంట్లు గోదాముకు లారీలు రావడానికి రస్తా కోసం వదిలారు. ఇటీవల కొంత మంది అక్రమంగా స్థలం ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై ఫిర్యాదు మేరకు సీఐ ఈశ్వరయ్య పోలీసు సిబ్బందిని పంపి స్థలాలు ఆక్రమించుకున్న వారి వివరాలను సేకరించారు. ఆక్రమణదారులను స్టేషన్‌కు పిలిపించి స్థలం ఖాళీ చేయాలని సూచించారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండండి

హొళగుంద: వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సుళువాయి సర్పంచ్ మౌలాలి సూచించారు. మంగళవారం సుళువాయి సచివాలయంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీలు ఇతర సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శేషన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తం చేయండి

ఆలూరు: పల్లెల్లో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని దేవనకొండ పీహెచ్‌సీ వైద్యుడు విజయభాస్కర్ ఏఎస్‌ఎంలు, ఆశ వర్కర్లను ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల వ్యాధులను నివారించవచ్చని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య, భాగ్యలక్ష్మి, సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ హనుమంతయ్య, ఉమాబాయ్, రామోమహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనం.. భవితకు సోపానం

- ఎన్ఎంఎంఎస్‌లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ఆదోని, పత్తికొండ డివిజన్లలో 150 మంది విద్యార్థుల ఎంపిక
- ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్
- సత్ఫలితాలనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు



ఆలూరు మోడల్ స్కూల్

ఆలూరు రూరల్: తల్లిదండ్రులు పడుతున్న శ్రమను వారు కళ్లారా చూశారు. తమ చదువు అమ్మానాన్నకు భారం కాకుడదని భావించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కష్టపడి చదివి నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్ షిప్ అర్హత పరీక్షలో సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఏటా జాతీయ స్థాయిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తుంది. అందులో ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకారం వేతనం అందిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఆదోని, పత్తికొండ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులు అర్హత సాధించి ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను చేరువ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే నిరుపేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. డిజిటల్ విద్యను అందించేందుకు ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు అందించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. దీంతో నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ అవుతా..



మా నాన్న మల్లికార్జున ఆలూరు గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అమ్మ మహారాణి కూలీ పనికి పోతుంది. అమ్మనాన్నల కష్టం చూసి బాగా చదువుకోవాలని నిర్ణయించుకున్నా. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు జగనన్న ఇచ్చిన ట్యాబ్ బాగా ఉపయోగపడింది. బాగా చదివి కలెక్టర్ ఉద్యోగం సాధించాలన్నదే నా ధ్యేయం.

– పవన్ కుమార్, 8వ తరగతి, ప్రభుత్వ పాఠశాల–1 ఆలూరు.

జవానుగా సేవలందిస్తా



మాది అనంపురం జిల్లా విడపనకల్లు మండలం ఉండబండ గ్రామం. మా నాన్న మారెన్న ఆటో డ్రైవర్. అమ్మ ఇంట్లో జాకెట్లు కుట్టి జీవనం సాగిస్తున్నారు. నేను మా మామయ్య ఇంట్లో ఉంటూ ఆలూరు బాయ్స్–1 స్కూల్‌లో చదువుకుంటున్నాను. జగన్ మామయ్య మా స్కూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇంగ్లిష్ మీడియం వల్లే నేను ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించగలిగాను. మంచిగా చదువుకుని ఆర్మీలో సేవలందిస్తా.

– మధు, 8వ తరగతి, ప్రభుత్వ పాఠశాల–1 ఆలూరు

8న భజన పోటీలు

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో సిద్ధరామేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఈనెల 8న రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన భజన బృందాలకు మొదటి బహుమతి రూ.20 వేలు మొదలుకుని 11వ బహుమతి వరకు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల భజన బృందాలు ఎంట్రీ ఫీజు రూ.400 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 99631 19572, 79938 64914 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి పక్కీరప్ప తాత ఉత్సవాలు

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో వెలసిన అవధూత శ్రీపక్కీరప్ప స్వామి రథోత్సవ ఉత్సవాలు బుధవారం నుంచి 7వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం స్వామి వారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగింపు, 6న ఉదయం ప్రత్యేకపూజలు, సాయంత్రం బోనాలతో ఉరేగింపు నిర్వహించిన అనంతరం జనవాహిని మధ్య రథోత్సవం, 7న పారువేటతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

ఘనంగా సుంకులమ్మ జాతర



క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచి బహుమతి అందుకుంటున్న సిద్ధినగట్టు ప్రేమ్ జట్టు

వెల్దుర్తి: సిద్ధినగట్టు గ్రామంలో సుంకులమ్మ తల్లి బోనాల పండుగ (జాతర) మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాత్కాలిక అంగళ్ల వద్ద కొనుగోళ్లు, పుట్టింటికి చేరుకున్న ఆడపడుచులతో గ్రామంలో కోలాహలం సంతరించుకుంది.

క్రికెట్ పోటీల విజేత సిద్ధినగట్టు ప్రేమ్ జట్టు

సుంకులమ్మ తల్లి జాతర పురస్కరించుకుని వారం క్రితం ప్రారంభించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. 40 జట్లు తలపడిన పోటీలలో ఫైనల్‌లో సిద్ధినగట్టు ప్రేమ్ జట్టు వెల్దుర్తి బాలుమహేశ్ జట్టును ఓడించి విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు రూ.20 వేలు, రన్నర్స్‌కు 15 వేలు, మూడవ స్థానంలో నిలిచిన సిద్ధినగట్టు జూనియర్స్ జట్టుకు రూ.10 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన సూదేపల్లె పవన్ జట్టుకు రూ.5 వేలు, ట్రోఫీలు, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్, మ్యాచ్ తదితర బహుమతులను నిర్వాహకులు అందించారు.

నేడు గిరకపందేలు

5వ తేదీ మండల స్థాయి ఒక బండి గిరక పందేలు నిర్వహించనున్నారు. విన్నర్‌కు రూ.10 వేలు, రన్నర్‌కు రూ.5 వేలు అందించనున్నారు. వివరాలకు 9640350047 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ సూచించారు. మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఎంపిక చేసిన 60 మంది రైతులకు ఈ నెల 6వ తేదీ వరకు పంటల సాగుపై శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం శిక్షణలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి, వేరుశనగ, వరి, ఆపరాలు, మిరప, ఉల్లి పంటల సాగులో మెలకువలు వివరించారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకొని భూసార పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేసుకుంటే మంచిదని తెలిపారు. బనవాసిలో మట్టి నుమునా, నీటి నమునా పరీక్షలు చేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కేవీకేలో సాగు చేస్తున్న పంటలు, షేడ్ నెట్‌లో పెంచుతున్న నారు మడులపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, లక్ష్మణ్, మౌనిక, నిరంజన్‌రెడ్డి, చందన, మహదేవయ్య, రైతులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం





చిప్పగిరిలో వైఎస్సార్ ఆసరా మెగా చెక్ అందజేస్తున్న నారాయణ స్వామి, శ్రీనివాసులు, హాజరైన పొదుపు మహిళలు

చిప్పగిరి: మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పార్టీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద 674 పొదుపు గ్రూపులలోని 6,870 మంది మహిళలకు మంజూరైన రూ 2,99,84,000 మెగా చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మహిళలను పట్టించుకోలేదని, ప్రస్తుతం వైఎస్ జగనన్న పాలనలో మహిళాభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మ ఒడి లాంటి పథకాలతో పాటు సొంతిల్లు లేని కుటుంబాలకు మహిళల పేరిట ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించి 2024లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య, సర్పంచ్ గోవింద రాజులు, నాయకులు మల్లికార్జున, ధర్మేంద్ర, లాల్‌స్వామి, ధనుంజయ, బాలాజీ, చైతన్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న'

ఆలూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు తెలిపారు. వారు మంగళవారం చిప్పగిరిలో మూడవ విడత ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం మంత్రి గుమ్మనూరు జయరాం చేతులమీదుగా లోగోలను త్వరలో ఆవిష్కరిస్తామన్నారు. అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముద్దయ్య స్వామి తిరునాల ప్రారంభం



గోవర్ధనగిరి ముక్కంటీశ్వర ఆలయం

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి సమీపంలో ముద్దయ్యస్వామిచే ప్రతిష్టింపబడిన ముక్కంటీశ్వర స్వామి కల్యాణోత్సవాలు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి ముద్దయ్య ఆధ్వర్యంలో గణపతిపూజ, పల్లకీసేవ, రుద్రాభిషేకాలు నిర్వహించారు. చైత్ర పౌర్ణమి రోజుల్లో జరుపుకునే ఈ ఉత్సవాలనే ఈ ప్రాంత ప్రజలు ముద్దయ్య స్వామి తిరునాలగా, ముద్దయ్య పున్నమిగా పిలుచుకుంటారు.

ఉత్సవాల వివరాలు

5న బుధవారం ప్రత్యేక పూజలు, కలశ స్థాపన, పల్లకీ, నందికోల సేవ, రాత్రి రేలారేరేలా, జబర్దస్త్ కార్యక్రమాలు, 6న ఉదయం 5.35 గంటల్లోపు పార్వతీ, ముక్కంటీశ్వరుల కల్యాణోత్సవం, సాయంత్ర 5గంటలకు రథోత్సవం జరుగుతుందని పూజారి బద్దల పుల్లయ్య తెలిపారు. అనంతరం పరుగు పందెం నిర్వహించి విన్నర్‌కు 5 తులాలు, రన్నర్‌కు 3 తులాల వెండి పతకం బహూకరించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కట్టె కోలన్న, రాత్రి చెక్కభజన, 7వ తేదీన వసంతోత్సవం నిర్వహించనున్నారు. అలాగే న్యూ కేటగిరీ వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించి, విజేతకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబీకులు దాతగా రూ.50 వేలు, తర్వాతి స్థానాలలో నిలిచిన వారికి రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నారు. అనంతరం రాతి గుండు ఎత్తు పందెం నిర్వహించి ప్రథమ, ద్వితీయ విజేతలకు 10 తులాలు, 5 తులాల వెండి పతకాలు అందించనున్నారు. ఆయా పోటీలలో పాల్గొన దలచిన వారు 99499 04221, 99125 30191 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు మద్దికెరకు ఎమ్మెల్యే రాక

మద్దికెర: మండలకేంద్రంలో బుధవారం సాయంత్రం 3:30 గంటలకు నిర్వహించే ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సూర్యప్రకాష్ మంగళవారం తెలిపారు. మండలంలోని 554 గ్రూపుల్లోని 6,070 మంది పొదుపు మహిళలకు రూ.3.60 కోట్లు ఆసరా పథకం కింద మంజూరైన చెక్కును పొదుపు కార్యాలయం ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో పంపిణీ చేస్తారని వెల్లడించారు.

చేసిన మేలును వివరిద్దాం

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ చేసిన మేలును, సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి ప్రజలకు వివరిద్దామని సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, గ్రామ కన్వీనర్ బండ్లపల్లి వెంకటేశ్వర్లు సూచించారు. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై మంగళవారం శభాష్‌పురం, ముక్కెల్లలో గృహసారథులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, చంద్రన్న, గిడ్డయ్య, గోవర్ధనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నందవరంలో ఆసరా సంబరాలు

నందవరం: మండల కేంద్రంలోని సచివాలయం–1 ఆవరణలో బుధవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనునట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. మండల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వడదెబ్బ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు వైద్యాధికారి మహేశ్వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎండల తీవ్రత అధికంగా ఉందని మధ్యాహ్న సమయానికి ప్రజలు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవడం మంచిదని సూచించారు. ఎక్కువగా పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలని సూచించారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రజలకు వడదెబ్బ వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పనులు వేగవంతం చేయండి

నందవరం: డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పీఆర్ ఏఈ జయన్న ఆదేశించారు. ఆయన మంగళవారం ఇబ్రహీంపురం బీసీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా కొలతలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఏజెన్సీకి సూచించారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

గజవాహనంపై వనం వేంకటేశుడు

వెల్దుర్తి: రామళ్లకోట బ్రహ్మోత్సవాల్లో భాగంగా భూదేవి, శ్రీదేవి సమేత వనం వేంకటేశుడు మంగళవారం గజవాహనంపై ఊరేగారు. పురవీధులగుండా సాగిన దేవ, దేవేరులను కనులారా తిలకించిన గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాకర్తలుగా చావాది తిమ్మయ్య, మహేశ్వరనాయుడు, బజారు, తిమ్మన్న, రమణ వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పత్తికొండ రూరల్: స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలో బైక్‌పై వెళ్తున్న చక్రాళ్ల కాశీం అనే వ్యక్తిని మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. రోడ్డు పక్కన లేవలేని స్థితిలో పడిపోయిన కాశీంను గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఠంచన్‌గా పింఛను



జొన్నగిరిలో అటక రంగన్నకు దివ్యాంగ పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్ శోభ

నందవరం: మండలంలో అన్ని గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 6,986 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.1.92 కోట్లు నగదు మంజూరు చేసిందని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం నాగలదిన్నె గ్రామంలో 90 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేయగా మండలవ్యాప్తంగా 52.23 శాతం మందికి పింఛను సొమ్ము అందించినట్లు చెప్పారు. మిగతా వారికి మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని వెల్లడించారు.

తుగ్గలి: మండలంలో మంగళవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వరుస సెలవుల కారణంగా ఈసారి పింఛన్ల పంపిణీ కాస్త ఆలస్యమైంది. మండలంలో మొత్తం 7,597 పింఛన్లకు గాను రూ.2,10,28,000 మంజూరైంది. తొలి రోజు సాయంత్రం 5 గంటల వరకు 50 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఎస్ఎం బాషా తెలిపారు.

గోనెగండ్ల: మండల పరిధిలో మొదటి రోజు 60 శాతం మందికి పింఛన్ల పంపిణీ జరిగిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. బుధవారం వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతుందని పేర్కొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



పత్తికొండలో రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

పత్తికొండటౌన్: న్యాయవాదుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, సురేంద్ర డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో న్యాయవాది వీరేంద్ర నర్వాల్ దారుణ హత్య, రాజమండ్రిలో న్యాయవాది దుగ్గిరాల సుభాష్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ జిల్లా బార్‌అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం పత్తికొండలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టుకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గంటకు పైగా ఆందోళన చేయడంతో రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దామోదరాచారి, కోశాధికారి మహేశ్, లైబ్రేరియన్ రవికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు



మార్లమడికి రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: హొళగుంద నుంచి కర్ణాటక సరిహద్దు వరకు దాదాపు 5 కి.మీ మార్లమడికి రోడ్డును మంగళవారం పీఆర్ (పీఐయూ) డీఈఈ భాస్కర్ పరిశీలించారు. అలాగే సమ్మతగేరి, ఎల్లార్తి – ఆలూరు రోడ్లను కూడా పరిశీలించారు. మార్లమడికి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు సుమారు రూ.4.70 కోట్లతో అంచనాలు తయారు చేసి నిధులు మంజూరుకు ప్రతిపాదనాలు పంపనున్నట్లు డీఈఈ తెలిపారు. అదేవిధంగా ఆలూరు నుంచి అరికెర క్రాస్ వరకు డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనాలు పంపించామన్నారు. ఇప్పటికే హొళగుంద–ఆలూరు వయా ఎల్లార్తి రోడ్డులో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీఆర్ ఏఈ సోమప్ప తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్లకు మహర్దశ

గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా దెబ్బతిన్న రోడ్లను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాగు చేసినట్లు పార్టీ మండల కన్వీనర్ షఫీవుల్లా పేర్కొన్నారు. కోగిలతోట, ముగుమానుగుంది, సుళువాయి, ఆలూరు–హొళగుంద వయా ఎల్లార్తి లింగంపల్లి, హెబ్బటం–పెద్దగోనెహాళ్ రోడ్లను బాగు చేసినట్లు ఆయన చెప్పారు. మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఆదోని రోడ్డుతో పాటు హొళగుంద–మార్లమడికి డబుల్ రోడ్డు, వేదావతి(హగరి) పై ఉన్న వంతెన మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.

6 నుంచి పోతులింగేశ్వర స్వామి జాతర

హొళగుంద: భక్తుల కోర్కెలు తీర్చే ఆరాధ్యదేవుడిగా పేరున్న గజ్జహళ్లి పోతులింగేశ్వర స్వామి జాతర ఈ నెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవంలో భాగంగా ఈ నెల 5న ఉచ్చాయం, పల్లకిసేవ, 6న రథోత్సవం, 7న వసంతోత్సవం, లంకదహనం కార్యక్రమాలు, 8న జాతర ముగింపోత్సవాలు నిర్వహించనున్నట్లు స్వామి భక్త మండలి సభ్యులు తెలిపారు. భక్తులకు మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవంలో భాగంగా కబడ్డీ, ఎద్దుల పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలి

ఆలూరు: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని ఎంఈఓ కోమలాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడమేగాకుండా క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, శ్రీనివాసులు, పుష్పాంజలి, తదితరులు ఉన్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు: స్థానిక కోసిగి రోడ్డులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త యూజీ కేశవవర్ధన్, నిర్వాహకులు సీతారామయ్య, ప్రకాష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు సోమప్ప సర్కిల్‌లోని పాత ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవం ప్రారంభిస్తారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కావళ్లతోను, సత్యవేళ్లతోనూ ఊరేగింపుగా రథాన్ని పురవీధుల్లో లాగుతారు. అక్కడి నుంచి షరాఫ్ బజార్, నీలకంఠేశ్వరస్వామి దేవాలయం, శ్రీనివాస సర్కిల్, బడేసాబ్‌దర్గా, మార్కెట్‌యార్డు సర్కిల్ మీదుగా శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వరకు రథోత్సవం జరుగుతుంది. రథోత్సవంలో తమిళనాడు నుంచి వచ్చిన భక్తులు ఇనుప శూలాలను వీపు, దవడ, చెవులకు గుచ్చుకొని మొక్కు చెల్లించుకుంటారు. రథోత్సవం అనంతరం సుబ్రమణ్యేశ్వరస్వామికి మధ్యాహ్నం 12 గంటలకు అభిషేకం, భస్మపూజ, మహామంగళహారతి నిర్వహిస్తారు. రెండు గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు పల్లకోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

కృష్ణగిరి: పుట్లూరు, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో భక్తుల ఇలవెల్పు దేవతలైన మారెమ్మ, రేణుకా ఎల్లమ్మల ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి నైవేద్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా దేవాలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వేతనాలు పెంచాలని నిరసన

హొళగుంద: మండల విద్యా శాఖ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి వేతనాలు పెంచాలని మంగళవారం హొళగుందలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. సిబ్బంది సాయిబేష్, పంపాపతి, మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.